


ఫిరంగిపురంలోని చర్చిలో ప్రార్ధనలు చేస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య



నరసరావుపేటలోని సెయింట్ ఆన్స్ చర్చిలో బొమ్మలతో ఏర్పాటు చేసిన క్రీస్తు జననం అలంకారం



విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్న నరసరావుపేటలోని టౌన్ బాప్టిస్ట్ చర్చి

..హ్యాపీ క్రిస్మస్

- అర్ధరాత్రి పూజలతో వేడుకలు ప్రారంభం
- బాలయేసు జననాన్ని స్వాగతిస్తూ ప్రార్ధనలు
- రంగురంగుల విద్యుత్ దీపాలతో కాంతులీనుతోన్న చర్చిలు
- చర్చిల్లో కేక్‌లు కట్ చేసి.. క్యాండిల్స్ వెలిగించి.. మిఠాయిల పంపిణీ

నరసరావుపేట డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రంగురంగుల విద్యుత్ దీపాలతో చర్చిలు కాంతులీనుతుండగా.. నూతన వస్త్రాలు ధరించి చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా సందడి చేస్తుండగా.. క్రిస్మస్ వేడుకలు మంగళవారం అర్ధరాత్రి పూజలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి పట్టణ, గ్రామాల కూడళ్లలో క్రీస్తు జననాన్ని స్వాగతిస్తూ క్రైస్తవులు ఆనందోత్సాహాలతో బాణాసంచా కాల్చి ఉత్సవాలు జరుపుకున్నారు. హ్యాపీ క్రిస్మస్.. హ్యాపీ క్రిస్మస్ అంటూ ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బాలయేసు జననాన్ని స్వాగతిస్తూ భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో క్రిస్మస్ సందడి వాతావరణం నెలకొంది. అన్ని గ్రామాలు, పట్టణాల్లో చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలకు బాణాసంచా కాల్చి.. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి క్రైస్తవులు ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. అత్యంత భారీ నక్షత్రాలు వీధుల్లో విద్యుత్ కాంతులతో వెలుగులీనాయి. అదే సమయంలో గుంటూరు మేత్రాసన బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య ఫిరంగిపురంలోని ఆలయంలో అర్ధరాత్రి ప్రత్యేక పూజలతో క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. అనంతరం భక్తులకు దైవ సందేశం ఇచ్చారు. లోక శాంతి, పాప పరిహారం, సర్వమానవాళి రక్షణ కోసమే క్రీస్తు మనిషి రూపంలో జన్మించారని తన సందేశంలో పేర్కొన్నారు. క్రీస్తు బోధనలు సర్వమానవాళికి అనుసరణీయమన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన గురువులు ఆయా పూజలకు ముఖ్యఅతిథులుగా దైవ సందేశం ఇచ్చారు. సర్వమానవాళి సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో తులతూగాలని ఆయా పూజల్లో గురువులు, పాస్టర్లు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. క్రీస్తు ప్రబోధించిన దయ, క్షమ, ప్రేమ, కరుణ, వంటి బోధనలను ప్రతి ఒక్కరు ఆచరించాలని సందేశమిచ్చారు. నరసరావుపేట స్టేషన్‌రోడ్డులోని బాప్టిస్ట్ చర్చి, ప్రకాశంనగర్‌లోని సెయింట్ ఆన్స్ చర్చి, చిలకలూరిపేట రోడ్డులోని లూథరన్ చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి. కంభంపాలెం, క్రిష్టియన్‌పాలెం తదితర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మత సామరస్యాన్ని చాటి చెప్పేలా వివిధ మతాలకు చెందిన భక్తులు కూడా హాజరై క్రీస్తును ఆశీస్సుల కోసం కొనియాడారు.


ఆరుబయట పూజలకు వర్షం అడ్డంకి

క్రిస్మస్ సందర్భంగా ఏటా అర్ధరాత్రి జరిగే పూజలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారు. దీంతో చర్చిల్లో భక్తులు పట్టే అవకాశం ఉండదు. అందువల్ల అర్ధరాత్రి పూజలను ఆరుబయట నిర్వహించడం ఆనవాయితీ. అయితే పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి కూడా వర్షం కురవడంతో ఆరుబయట పూజలకు అడ్డంకిగా మారింది.



క్రిస్మస్ తాత అలంకరణలో వినుకొండ గీతాంజలి పాఠశాల విద్యార్థులు

వాయుగండం



నగరం మండలం ధూళిపూడి గ్రామంలో తడిచి ముద్దయిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

జిల్లా అంతటా జల్లులు

- కోతకోయని చేలన్నీ నేల మట్టం
- పంటలపై వాయుగుండం ప్రభావం
- తడిచిన ధాన్యం.. పొలాల్లోనే ఓదెలు
- హార్బర్‌లో 3వ నంబరు ప్రమాద హెచ్చరిక
- వరుస తుఫాన్లతో బెంబేలెత్తుతున్న అన్నదాతలు

వరుస వాయుగుండాలు.. వణికిస్తున్నాయి. అన్నదాతలను వాయుగండాలు వీడటంలేదు. ధాన్యం చేతికొచ్చే డిసెంబరు నెలలో వరుసగా ఏర్పడుతున్న అల్పపీడనాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో నాలుగు రోజులుగా వాతావరణం పూర్తిగా మారి వర్షం దోబూచులాడుతూ వచ్చింది. సోమవారం ఆకాశం మేఘాలతో కమ్ముకున్నా పెద్దగా ఇబ్బంది ఉండదన్న భరోసాతో కొందరు రైతులు కోతలు కోశారు. మరికొందరు యంత్రాల సాయంతో కోసి ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు. వాయుగుండం కారణంగా మంగళవారం వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. తెల్లవారుజాము నుంచి కొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం నుంచి కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులతో పాటు చిరుజల్లుల నుంచి ఓ మోస్తరుగా వర్షాలు పడ్డాయి. ఆరు గాలం శ్రమించిన పంట చేతికందేలోపు అకాల వర్షం నష్ట పరుస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముమ్మరంగా నూర్పిళ్లు జరగాల్సిన సమయంలో వర్షం అడ్డంకిగా మారింది.



బొల్లాపల్లి : కల్లాల్లో ఆరబోసిన మిర్చి, ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు



రాజుపాలెం మండలం ఉప్పలపాడులో పట్టల మీద నిలబడిన వర్షం నీరు



ఈపూరు మండలంలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచే చిరుజల్లులు కురవడంతో పాటు దట్టంగా ముసురు కమ్మేసింది. ఇదే తరహా పరిస్థితులు మరో మూడు రోజులు ఉండనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ వరకు కోతలు వద్దని రైతులకు అధికారులు సూచిస్తున్నారు. తుఫాన్ ప్రభావం వల్ల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నోటి దాక వచ్చిన పంట అకాల వర్షంతో అపార నష్టం జరుగుతుందని రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. రెండు రోజులుగా ముసురు కప్పేసి, అడపాదడపా వరుణుడు ప్రతాపం చూపుతుండటంతో యంత్రాలతో కోతకోసి, ఆరబెట్టిన రైతులకూ నష్టం తప్పలేదు. పట్టాలు ఉన్న వారు ధాన్యంపై కప్పుకుంటున్నారు. అవి దొరకని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షంతో పంట నీట మునగడమే కాకుండా ఓదెలపై నీరు నిలిచి ధాన్యం కుళ్లి పోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లా పరిధిలో కూడా మంగళవారం ముసురు పట్టి అక్కడక్కడ వర్షాలు పడ్డాయి. డెల్టా ప్రాంతంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా చాలాప్రాంతాల్లో పైరు నేల వాలింది. వాయుగుండం కారణంగా యంత్రాలతో కోసిన ధాన్యాన్ని రోడ్లు, పొలాల్లో ఆరబెట్టగా వర్షానికి కొంతమేర తడిసిపోయింది. ఇప్పటికే పొలాల్లోని పనలు తడిసి మొలకలు రావడం, పైరు నేలవాలడం, ధాన్యం రంగుమారడం వంటివి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తేమ శాతం కోసం ధాన్యాన్ని ఆరబెట్టుకునే విషయంలో రైతుల కష్టాలు గడచిన నాలుగు వారాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. వర్ష హెచ్చరికల నేపథ్యంలో తడిగా ఉండగానే కుప్పలు వేస్తున్నారు. జల్లులకు తోడు ఎడతెగని ముసురు అన్నదాతలను భయపెడుతోంది. జల్లులతో అల్పపీడన ప్రభావం వీడితే కొద్ది నష్టంతో బయటపడతామని, అలాకాకుండా రాబోయే రెండు రోజుల్లో ఓ మోస్తరు వర్షం పడినా పొలాల్లో నీళ్లు నిలబడతాయని, దీని వల్ల ధాన్యం రంగుమారడంతో పాటు దిగుబడుల్లో కూడా గణనీయంగా తేడా కనబడుతుందని అన్నదాతలు వాపోతున్నారు. దిగుబడులు

(మిగతా 6వ పేజీలో)

పల్నాట.. ముసురు

అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా మంగళవారం ముసురుపట్టింది. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. ముందస్తుగా నాట్లు వేసిన ప్రాంతాల్లో ఇప్పటికే నూర్పిళ్లు పూర్తి కాగా పొలాల్లోనే ధాన్యం రాశులు ఉన్నాయి. వాన రాకతో పొలాల్లోని ధాన్యం తడవకుండా రైతులు రక్షణ చర్యలు చేపడుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే ధాన్యం చేతికి వచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచవరం, గురజాల మండలాల పరిధిలో మధ్యాహ్నం నుంచి ఎడతెరపి లేకుండా చిరుజల్లులు పడ్డాయి. శనగ, పత్తి, మిరప, పొగాకు, మొక్కజొన్న పంటలపై వర్షం తీవ్ర ప్రభావం చూపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికి అందాల్సిన పంట వర్షానికి తడిచిపోతుండటంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎడతెరపి లేకుండా చిరుజల్లులు పడుతుండటంతో రైతులు నడికూడి మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యాన్ని పట్టలు కప్పి కాపాడుకుంటున్నారు. సత్తెనపల్లి ప్రాంతంలో మంగళవారం ఆకాశంలో మబ్బులు కమ్మి వర్షం పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుసగా అల్పపీడనాలతో పత్తి, మిర్చి సాగు చేస్తున్న రైతులు బెంబేలెత్తిపోతున్నారు. బొల్లాపల్లి మండలంలో మంగళవారం వర్షం కారణంగా కల్లాల్లో అర బోసిన మిర్చి, పొగాకు, ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీశారు. రాజుపాలెం మండలంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఓ మోస్తారు వర్షం కురిసింది. రైతులు వరి, మిర్చి కోతలు ప్రారంభించగా వర్షాలతో ఆందోళన చెందుతున్నారు. పూతమీద ఉన్న కందిపంటకు నష్టమని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. రెండు రోజుల క్రితం వినుకొండ నియోజకవర్గ పరిధిలో కురిసిన భారీ వర్షంతో నష్టపోయిన పంటలను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ అంజనేయులు పరిశీలించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు.

167ఏ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చాలి

రియల్‌ఎస్టేట్ వ్యాపారుల కోసం రోడ్డు వేస్తారా?

జొన్నలగడ్డ వద్ద కర్నూలు-గుంటూరు హైవేపై రైతుల ధర్నా

నరసరావుపేట టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నకరికల్లు అడ్డరోడు - చీరాల ఓడరేవు 167ఏ హైవే అలైన్‌మెంట్ మార్చాలని రైతులు డిమాండ్ చేశారు. జొన్నలగడ్డ వద్ద కర్నూలు-గుంటూరు హైవేపై రైతులు మంగళవారం ధర్నా చేశారు. కేసానుపల్లి, జొన్నలగడ్డ, ఇస్సపాలెం, గుంటగార్లపాడు, రావిపాడు గ్రామాలకు చెందిన బాధిత రైతులు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది బడా, రాజకీయ నాయకులు భూముల స్వార్థం కోసం చిన్న, సన్నకారు రైతులను ఇబ్బంది పెట్టి అలైన్‌మెంట్ పాతదే ఖాయం చేస్తున్నారని ఆరోపించారు. 167ఏ హైవేకి మూడు అలైన్‌మెంట్లు సూచించగా కేంద్ర మంత్రి గడ్కరీ నియమించిన కమిటీ తమను సంప్రదించకుండా మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో కూర్చొని పాత అలైన్‌మెంటే ఖాయం చేసిందన్నారు. రెవెన్యూ అధికారులు పోలీసులను అడ్డుపెట్టుకుని తమకు తెలియకుండా రాళ్లు పాతడం దారుణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే మంత్రి లోకేశ్‌ను కలిశామని, త్వరలో ఈ సమస్యపై ముఖ్యమంత్రిని కూడా కలుస్తామన్నారు. భూములపై హక్కు లేదంటే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. నరసరావుపేట పట్టణానికి కిలోమీటరు దూరంలో 167ఏ హైవే ఏర్పాటు చేస్తున్నారని, ఇంత సమీపంలో హైవే ఏర్పాటు ఎక్కడా లేదన్నారు. మూడు అలైన్‌మెంట్లలో ఆప్షన్-1 లేదా ఆప్షన్-3 ఎంచుకోవాలన్నారు. ఇప్పుడు వేసే రోడ్డు నాలుగేళ్ల తర్వాత పనికిరాదని తెలిపారు. నలుగురు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం రోడ్డు వేస్తున్నారని రైతుల ఆరోపించారు. ఆందోళన చేస్తున్న రైతులతో తహసీల్దారు వేణుగోపాలరావు, డీఎస్పీ నాగేశ్వరరావు చర్చలు జరిపారు. వారిచ్చిన హామీతో రైతులు ఆందోళన విరమించారు.



జొన్నలగడ్డ వద్ద గుంటూరు-కర్నూలు హైవేపై ధర్నా చేస్తున్న రైతులు

8 గుంటూరు - నడికుడి సెక్షన్‌లో
పెరిగిన రైళ్ల క్రాసింగ్‌లు
• అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

ఉపాధి కూలీలకు తీపికబురు
• ఇకపై కనీస వేతనం రూ.300
• నిరంతరం తనిఖీలు, పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ

167ఏ హైవే అలైన్‌మెంట్‌ను మార్చండి

- కేసానుపల్లి, జొన్నలగడ్డ తదితర గ్రామాల రైతుల డిమాండ్
- జొన్నలగడ్డ వద్ద కర్నూలు-గుంటూరు రహదారిపై రాస్తారోకో

నరసరావుపేట టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జొన్నలగడ్డ వద్ద కర్నూలు-గుంటూరు హైవేపై మంగళవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. నకరికల్లు అడ్డరోడ్డు - చీరాల ఓడరేవు 167ఏ హైవే అలైన్‌మెంట్‌ను మార్చాలని కేసానుపల్లి, జొన్నలగడ్డ, ఇస్సపాలెం, గుంట గార్లపాడు, రావిపాడుకు చెందిన రైతులు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొంత మంది బడా నాయకులు, రాజకీయ నాయకులు భూములు కొనుగోలు చేశారని, వాళ్ళ స్వార్థం కోసం చిన్న, సన్నకారు రైతులను ఇబ్బంది పెడుతూ పాతఅలైన్‌మెంట్‌నే ఖాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చిన



రైతులతో చర్చిస్తున్న తహసీల్దార్ కే వేణుగోపాలరావు, డీఎస్పీ కే నాగేశ్వరరావు తదితరులు

గడ్కరి కమిటీ ఇక్కడి రైతులను సంప్రదించ కుండా మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో కూర్చుని ఇప్పటికే ఉన్న అలైన్‌మెంట్‌నే ఖాయం చేశారని ఆరోపించారు. ఇక్కడ రెవెన్యూ డిపార్టుమెంట్ సహకరించకుండా, తెలియకుండా రాళ్ళు పాతడం, పోలీసులను అడ్డుపెట్టుకొని తమ భూములను కాపాడుకునే హక్కు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై



జొన్నలగడ్డ వద్ద గుంటూరు-కర్నూలు హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ఇప్పటికే మంత్రి లోకేశ్‌ను కలిశామని, ముఖ్యమంత్రి చంద్రబాబును కూడా కలవ నున్నట్లు చెప్పారు. రైతులకు హక్కులేదని అంటే ఆత్మహత్యలే శరణ్యమంటూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. 167ఏ హైవేకి మూడు అలైన్‌మెంట్‌లు సూచించారని అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటకి ఒక కిలోమీటరు దూరంలో 167ఏ హైవే ఏర్పాటు చేస్తున్నారని, పట్టణానికి ఇంతదగ్గరగా హైవే ఏర్పాటు ఎక్కడా లేదన్నారు. కష్టపడి సంపాదించుకున్న పొలాలు రోడ్డు కింద పోతే తమ భవిష్యత్ అంధ కారం అవుతుందన్నారు. ఇచ్చిన మూడు అలైన్ మెంట్‌లలో ఆప్షన్-1 లేదా ఆప్షన్-3 ఎంచు కోవాలన్నారని చెప్పారు. ఇప్పుడు వేసే 167ఏ రోడ్డు నాలుగేళ్ల తర్వాత పనికిరాదని, నలుగురు రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం ఈ రోడ్డు వేస్తున్నారని రైతుల ఆరోపించారు. ఈ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కోరారు. రాస్తారోకో చేస్తున్న రైతులతో తహసీల్దార్ కే వేణు గోపాలరావు, డీఎస్పీ కే నాగేశ్వరరావు చర్చలు జరిపి వారి ఆందోళ విర మింపజేశారు.

ధర్మం గెలిచింది... న్యాయపోరాటం ఫలించింది

- ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ ఆనందం
- ఎట్టకేలకు బీసీ ధ్రువీకరణపత్రం జారీ
- అండగా నిలిచిన మంత్రి నారా లోకేశ్‌కు, టీడీపీ నాయకులకు ఆమె ధన్యవాదాలు



నారా లోకేశ్‌తో షేక్ జబీన్ (ఫైల్)

దుగ్గిరాల, డిసెంబరు 24, (ఆంధ్రజ్యోతి) :'ధర్మం గెలిచింది.... న్యాయం జరిగింది' అంటూ మూడేళ్ల నిరీ క్షణ అనంతరం బీసీ ధ్రువీ కరణ పత్రాన్ని పొందిన ఇన్‌చార్జి ఎంపీపీ షేక్ జబీన్ ఆనందం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు బీసీగా అర్హత ఉన్నప్పటికీ రాజకీయకారణాలతో ధృవీ కరణ పత్రం అందక ఎంపీపీ పదవికి దూరంగా ఉన్న ఓ మహిళా ఎంపీటీసీ పోరాటం ఫలించింది. అన్యాయానికి, అధర్మానికి ఆయుష్షు తక్కువని రుజువు చేసింది. మండలపరిషత్ అధ్యక్ష పదవికి బీసీ వర్గానికి కేటాయించగా మండలంలోని 18 ఎంపీటీసీ స్థానాల్లో పదిమంది టీడీపీ సభ్యులు, జనసేన సభ్యురాలితో మొత్తం 11 మంది సభ్యుల మద్దతు కలిగి కూటమిలో బీసీ సభ్యురాలు చిలువూరు ఎంపీటీసీగా గెలుపొందిన షేక్ జబీన్ ఎంపీపీకి పదవి ఖరారైంది. ఈ నేపథ్యంలో అప్పటి వైసీపీ ప్రభుత్వం స్పష్టమైన మెజార్టీ సాధిం చింది. అయినప్పటికీ చిలువూరు ఎంపీటీసీగా గెలుపొందిన షేక్ జబీన్‌కు బీసీ ధృవీకరణ పత్రం అందకుండా చేశారని, మైనార్టీకి చెందిన మహిళ ఎంపీపీ పీఠం దక్కకుండా చేయాలని కుట్రపన్నుతున్నారంటూ టీడీపీ పలు రకాలుగా ఆందోళన చేపట్టినా ఫలితం లేకపోయింది. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ధర్మ పోరాటం చేద్దామని, నాటి ప్రతిపక్ష నేత, నేటి విద్య, ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ మనోధైర్యంతో ముందుకు వెళ్లాలన్న సూచన మేరకు జబీన్ ముందుకు సాగింది. తక్షణమే సమస్యను విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని హైకోర్టు ఆదే శాలు వచ్చినప్పటికీ, కలెక్టర్ సైతం జబీన్ అభ్యర్థనను తిరస్కరించారు. దీంతో సంఖ్యా బలం లేనప్పటికీ అప్పటి అధికార వైసీపీకి చెందిన బీసీ మహిళను ఎంపీపీని చేశారు. అయినప్పటికీ పట్టువిడవకుండా మనోధైర్యం కోల్పోకుండా బీసీ ధృవీకరణ పత్రం కోసం ఎదురు చూశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వ చ్చిన తర్వాత సెప్టెంబరులో జబీన్ మరోపర్యాయం బీసీ ధృవీకరణపత్రం కోసం తహసీల్దార్‌ను కలిశారు. బీసీ రిజర్వేషన్ రివిజన్ కమిటీకి వెళ్లాలని సూచించిన మీదట ప్రిన్సిపల్ సెక్రటరీ వద్దకు వెళ్లడం, డిసెంబరు 6న జిల్లా కలెక్టర్‌ను జబీన్ కలవడం జరిగింది. కలెక్టర్ ఆదేశాలతో స్థానిక తహసీల్దార్ గ్రామంలో వారి బంధువులను విచారణ చేసిన తర్వాత సంబంధిత నివేదికను కలెక్టర్‌కు పంపారు. అంతిమంగా అన్ని అర్హతలూ కలిగిన జబీన్‌కు బీసీ-ఈ ధృవీకరణ పత్రాన్ని జారీ చేశారు. తనకు అండగా నిలిచిన నారా లోకేశ్‌కు, ఎంపీటీసీ సభ్యులకు స్థానిక టీడీపీ నాయకులకు జబీన్ కృతజ్ఞతలు తెలిపారు.

గోవా-గుంటూరుకు ఎన్‌డీపీ మద్యం అక్రమ రవాణా

- గుంటూరు టూ టౌన్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన
- విక్రయిస్తూ పట్టుబడ్డ హెడ్ కానిస్టేబుళ్లు, మరోవ్యక్తి
- పల్నాడు జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు
- 133 మద్యం బాటిళ్లు స్వాధీనం



నిందితులను అరెస్ట్ చేసిన ఎక్సైజ్ శాఖ గుంటూరు ఈఎస్ అరుణ కుమారి, టూ టౌన్ సీఐ యశోదరదేవి, సిబ్బంది

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసులే, ఆ అకృత్యానికి పాల్పడుతున్న వ్యక్తికి అండగా నిలిచారు. గోవా, కర్ణాటక రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ (ఎన్‌డీపీ) మద్యం అక్రమంగా తీసుకువచ్చి గుంటూరులో విక్రయిస్తున్న ఆ వ్యక్తికి పోలీసులు సహకరిస్తున్నారు. ఎన్‌డీపీ మద్యం తీసుకొచ్చి ఒక పథకం ప్రకారం గుంటూరు పరిసర ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే, వీరి అక్రమ వ్యాపారం ఎన్నాళ్లో సాగలేదు. ఎక్సైజ్ పోలీసులకు దొరికిపోయారు. ఈ సంఘటన గుంటూరులోని టూ టౌన్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం నాడు జరిగింది. ఎక్సైజ్ శాఖ గుంటూరు ఈఎస్ అరుణ కుమారి కథనం ప్రకారం వివరాలు, స్థానిక నెహ్రూనగర్‌కు చెందిన ఘంటసాల బాజీ బాబు అలియాస్ బాబీ గత కొంతకాలంగా గోవా, కర్ణాటక ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా తీసుకువచ్చి గుంటూరు కేంద్రంగా విక్రయిస్తున్నాడు. ఈ అక్రమ వ్యాపారంలో పల్నాడు జిల్లా నరసరావుపేట అడ్మిన్ అదనపు ఎస్పీ ఆఫీసులో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ గంధ శివకృష్ణ, నరసరావుపేటలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న విష్ణుములకల వాసుదేవరావు, నరసరావుపేట ఎస్‌బీ కానిస్టేబుల్ గా పని చేస్తున్న ఆర్ల ఆనందరావు, గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంకు చెందిన కుక్కమల్ల సురేష్. ఈ నలుగురు సిండికేట్‌గా మారి గుంటూరు పరిసర ప్రాంతాల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారు. పాత కేసులో నిందితుడు, ప్రస్తుతం సబ్ జైల్‌లో ఉన్న బాజీబాబుకు స్నేహితులుగా మారి ఈ వ్యాపారం చేస్తున్నారు. ఈ విషయమై గుంటూరు టూ టౌన్ ఎక్సైజ్ సీఐ యశోదర దేవి రాబటిటన సమా చారం మేరకు ఎస్ఐలను, సిబ్బందిని ప్రత్యేక ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. శివకృష్ణ, వాసుదేవరావు, ఆనందరావుల వద్ద 133 గోవా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నలుగురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు అరుణ్ కుమారి తెలిపారు.

నేషనల్ ట్రైన్ ఎంక్వయిరీ సిస్టంలో తప్పుడు సమాచారం

- పల్నాడు ఎక్స్‌ప్రెస్ మంగళవారం రాత్రి గంటకు పైగా ఆలస్యం
- అయినప్పటికీ 15 నిమిషాలు ముందుగానే వచ్చినట్లు నమోదు

గుంటూరు, డిసెంబరు. 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే అధికారిక నేషనల్ ట్రైన్ ఎంక్వయిరీ సిస్టం(ఎన్‌టీఈఎస్)లో అధికారులు తప్పుడు సమాచారాన్ని నమోదు చేస్తున్నారు. మంగళవారం నంబరు. 12748 వికారాబాద్ - గుంటూరు పల్నాడు సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ గంటకు పైగా ఆలస్యంగా గుంటూరుకు చేరుకుంది. అయితే, ఈ రైలు నిర్ణీత సమయం రాత్రి 9.05 కంటే 15 నిమిషాల ముందుగానే అంటే 8.50కే గుంటూరుకు చేరినట్లు నివేదించారు. దీనిపై రైలులో ప్రయాణించిన ప్యాసింజర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్ అయి ఉండి గంటకు పైగా ఆలస్యంగా గమ్యస్థానానికి చేర్చినందుకు సిగ్గుపడాల్సిందిపోయి అందరిని తప్పుదోవ పట్టిస్తూ 15 నిమిషాలు ముందుగా చేరినట్లు నమోదు చేయడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ట్వీట్లు చేశారు. దీనిపై బుధవారం రైల్వే జీఎం, డీఆర్ఎంకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్ పై వేటు

నరసరావుపేట లీగల్, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి) : విధుల్లో అలసత్వం, నిధుల దుర్వినియోగం తదితర ఆరోపణలపై నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. విధుల నుంచి ఆయనను తప్పించింది. నాయక్ స్థానంలో ప్రస్తుత డీసీహెచ్ ఎస్ డాక్టర్ రంగారావుకు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైసీపీ హయాంలో ఆస్పత్రిలో బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు ఉన్నాయి. వీటిపై వైద్య ఆరోగ్య శాఖ విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో బిల్లుల చెల్లింపుల్లో అవకతవకలు జరిగినట్టు గుర్తించింది. దీంతో నాయక్‌పై చర్యలు తీసుకున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

వీఆర్‌కు మాచర్ల రూరల్ ఎస్ఐ నారాయణ

- ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మెమో జారీ



మాచర్లటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాచర్ల రూరల్ ఎస్ఐ నారాయణకు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి చార్జ్‌మెమో జారీ చేశారు. గతంలో సత్తెనపల్లి నియోజకవర్గంలోని రాజుపాలెం మండలం ఎస్ఐగా నారాయణ విధులు నిర్వహించారు. 2023వ సంవత్సరంలో కారు, బైకు ఢీ కొన్న సంఘటనలో ద్విచక్ర వాహనచోదకుని కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు రాజుపాలెం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో హెడ్ కానిస్టేబుల్‌గా ఉన్న పుల్లారావు ఈ విషయాన్ని ఎస్ఐ నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. బాధితుడికి రూ. 3 లక్షలు ఇచ్చేలా పోలీస్‌స్టేషన్‌లో సెటిల్‌మెంట్ చేశారు. అయితే, బాధితుడికి ఆ నగదు ఇవ్వలేదు. కాళ్లకు గాయం నయం కాకపోవడంతో బాధితుడు నడవలేని స్థితికి చేరుకున్నాడు. దీంతో, బాధితుడు ఇటీవల ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతురావు విచారణ జరపగా కారు, బైకు ఢీకొన్న సంఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని తేలింది. దీనికి తోడు పోలీసుల సమక్షంలోనే సెటిల్‌మెంట్ జరగడం వంటి విషయాలను ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్ఐ నారాయణకు చార్జ్‌మెమో జారీ చేసి వీఆర్‌కు పంపారు. ఇన్ చార్జి ఎస్ఐగా ఏఎస్ఐ రఫీ వ్యవహరిస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	102,110,122
చికెన్ విత్ స్కిన్	196.00
చికెన్ స్కిన్ లెస్	206.00



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

జనవరి 30న విజ్ఞాన్ ఫార్మసీలో అంతర్జాతీయ కాన్ఫరెన్స్

గుంటూరు(విద్య),డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో జనవరి 30 నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తు న్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాసబాబు మంగళ వారం తెలి పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన బ్రౌచర్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ఆవిష్కరించారు. 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్, ఫ్యూచరిస్టిక్ అప్రోచ్' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రేమ,శాంతి, సమభావనలకు ప్రతీక క్రిస్మస్

- ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రేమ,శాంతి సమ భావాలను కలిగి ఉండాలన్నదే క్రిస్మస్ పర్వదినం సందేశమని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా వినుకొండ నియోజకవర్గంతో పాటు రాష్ట్ర ప్రజలందరికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ పై ఆశలతో కొత్త సంకల్పాలతో కూడా రానున్న కొత్త ఏడాదిని స్వాగతించాలని కోరారు. రాష్ట్ర ప్రజలంత మనమంత ఒక కుటుంబమనే భావణతో శాంతి, సామరస్యాలతో కలిసి ఉండి ఒకొరికొకరు సహాయపడుతూ కలిసి పురోగమించాలని ఆకాంక్షించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్లరూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 575.70 అడు గులు ఉంది. ఇది 270.87 టీఎం సీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8717 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7937 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 20790 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 40,144 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 16,931 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ముగిసిన కౌన్సెలింగ్

- కార్పొరేషన్ 8, మున్సిపాల్టీల్లో 10 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు

గుంటూరు(విద్య),డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో మున్సిపల్,కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపా..ధ్యాయులకు మంగళ వారం పదోన్నతుల కౌన్సిలింగ్‌ను డీఈవో కార్యాలయంలో నిర్వహించారు. సెకండరీ గ్రేడ్ ఉపా.ధ్యాయులకు స్కూల్ అసి స్టెంట్స్‌గా పదోన్నతులు కల్పించినట్లు డీఈవో సీవీ రేణుక తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో తెలుగు -,3 ఇంగ్లీషు- 2, సోషల్ 1, హిందీ 2 చొప్పు మొత్తం మందికి పదోన్నతులు కల్పించారు. మున్సిపల్ పాఠశాలల పరి ధిలో ఇంగ్లీష 1, ఫిజికల్ సైన్స్ 1, బయాలజీ 2, సోషల్ 4, లెక్కలు 2 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించి పదోన్నతులు కల్పించినట్లు వెల్ల డించారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో విద్యాభివృద్ధి, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఏ తిరుమలేష్, సీనియర్ ప్రధానోపాధ్యాయుడు జే రమేష్‌కుమార్, ఉర్దూ డీఐ ఎస్‌కె ఎండీ ఖాసిం, ఎంఈవో ఎండీ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు నియామకపత్రం అందజేస్తున్న డీఈవో సీవీ రేణుక తదితరులు



నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యంపై పట్టాలు కప్పిన రైతులు

వాయు'గండం'

(5వ పేజీ తరువాయి)

అంతంతమాత్రంగా ఉన్న పరిస్థితుల్లో వరుస అల్పపీడనాలు తమను కుదేలు చేయడమే కాకుండా కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కొన్నిచోట్ల పూర్తిగా ఆరిపోయిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించడంలో ఆలస్యం కావడంతో గోతాలకెత్తి పట్టాలు కప్పిన బస్తాలు కూడా కింది నుంచి నీటి చెమ్మ చేరడంతో తడిచాయని రైతులు తెలిపారు. ఖరీఫ్ సాగు నుంచి గట్టెక్కి, రబీ కింద మొక్కజొన్న, మినుము విత్తనాలు ఈ రెండు రోజుల్లో వేసిన రైతులకూ నష్టం తప్పలేదు. వర్షంతో విత్తు కుళ్లిపోతోందని రైతుల ఆవేదన చెందుతున్నారు. అల్పపీడనం ప్రభావంతో రానున్న 24 గంటల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చేసిన ప్రకటన రైతుల కంటిపై కునుకు లేకుండా చేస్తోంది. కొన్ని పొలాల్లో కోతలు కోసి వరి ఓదెల మీద ఉన్నాయి. వాతావరణంలో మార్పులతో ఒక్కసారిగా కూలీలకు డిమాండ్ పెరిగి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కవారంరోజుల పాటు వర్షం పడకుండా ఉంటే రైతులు పూర్తిగా కోలుకుంటారని తెలుపుతున్నారు. పల్నాడు జిల్లాలో భారీ వర్షాలతో పత్తి పంట పూర్తిగా కుళ్లి నష్టపోయామని ధాన్యం కొంతమేర సంతృప్తి చెందుతుందనే దశలో అకాల వర్షం నష్ట పరుస్తుందని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

నాలుగో రోజూ.. మూడో నంబరు హెచ్చరిక



నిజాంపట్నం హార్బర్‌లో 3వ నంబరు ప్రమాద సూచిక ఎగురవేత

వాయుగుండం ప్రభావంతో నిజాంపట్నం హార్బర్‌లో మూడో నంబరు ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. నాలుగు రోజుల క్రితం ఈ హెచ్చరికను ఎగురవేసినప్పుడు వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఎండ కూడా ఉండటంతో వాయుగుండం ఉండ దని అంతా భావించారు. అయితే వాతావరణ శాఖ ముందే హెచ్చరించినట్లు మంగళవారానికి వాతావరణంలో మార్పులు చోటు చేసు కున్నాయి. సముద్రంలో వేటకు వెళ్లిన పడవలు ఒడ్డుకు చేరిపోయాచి. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చిన్న బోట్లు వారు వేటకు వెళ్లరాదని అధికారులు ఆదేశాలు జారీచేశారు.

73,529 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 76,386 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 73,529 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 52,093 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14500	334	8000	15000
నెంబరు. 5	9000	14000	నెంబరు.5	8500	11800
273	8500	11700	273	10500	10500
341	8500	15000	341	8000	13000
4884	13500	13500	4884	11000	12000
సూపర్ 10	10000	13500	సూపర్ 10	15500	15500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	16300	తేజ	7600	16500
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	7500	12000
దేవనూరు డీలక్స్	9000	15000	దేవనూరు డీలక్స్	8500	13000
తెల్లకాయలు	4000	11000	తెల్లకాయలు	4000	10500

జలజీవన్ మిషన్ నిధులు రూ.75 లక్షలు విడుదల

రెంటచింతల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చే నిమిత్తం జలజీవన్ మిషన్ పథకం కింద రూ.75 లక్షలు విడుదలైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెన్ను వెంకటేష్ చెప్పారు. గోలి, జెట్టిపాలెం, మిట్టగుడిపాడులకు ఒక్కో గ్రామానికి రూ.15 లక్షల చొప్పున మంచికల్లుకు రూ.30 లక్షలు విడుదలయ్యాయన్నారు.

సినిమాహాల్లో రికార్డుల తనిఖీ



పిడుగురాళ్లలో సినిమా హాలు రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ తదితరులు

పిడుగురాళ్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జయలక్ష్మి సినిమా హాలుకు సంబంధించి రికార్డులను గురజాల ఆర్‌డీవో మురళీకృష్ణ మంగళవారం పరిశీలించారు. సినిమా హాలును తనిఖీ చేసి అన్ని అనుమతులు ఉన్నాయా? అవి అమల్లో ఉన్నాయా లేవా వంటి రికార్డులను పరిశీలించి అధికారులను అడిగి తగు సమాచారం తీసుకున్నారు. పిడుగురాళ్ల అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్ శర్మ, ఇతర రెవెన్యూ అధికారులు ఉన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



వెంకటరావు (ఫైల్ ఫొటో)

క్రోసూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వస్తున్న కారు ఢీకొని మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఎర్రబాలెం గ్రామం వద్ద సోమవారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో ఉయ్యందన గ్రామానికి చెందిన రెట్టడి వెంకటరావు (38) అనే వ్యక్తి అక్కడి కక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉయ్యందన గ్రామానికి చెందిన రెట్టడి వెంకటరావు సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో క్రోసూరు వైపు నుంచి స్వగ్రామం ఉయ్యందన వెళ్లడానికి మోటారు బైక్‌పై బయలు దేరాడు. బైక్ ఎర్రబాలెం వంతెన వద్దకు వచ్చే సరికి ఎదురుగా సత్తెనపల్లి నుంచి వస్తున్న ఏపీ 40బీఎల్ 4167 నెంబరు గల కారు ఢీకొట్టింది. వెంకటరావు అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న ఉయ్యందన గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఢీకొట్టిన కారు ఆపకుండా వెళ్లిపోయింది. తెల్లవారే సరికి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టడంతో కారును వేల్పూరు దాటిన తరువాత గ్రంథసిరి అడ్డరోడ్డు వద్ద గుర్తించారు. డ్రైవర్ పరారైనట్టు తెలిపారు. కారు రిజిస్ట్రేషన్ నెంబరు ప్రకారం నరసరావుపేటలోని బరంపేటకు చెందిన రాజోలు వీరవెంకట్‌దిగా గుర్తించారు. మృతుడు వెంకటరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ నాగేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలియజేశారు.

పెరియార్ రామస్వామికి నివాళి

సత్తెనపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బీసీ సంఘ కార్యాలయంలో మంగళవారం సంఘసంస్కర్త పెరియార్ రామస్వామి వర్ధంతిని బీసీ సంఘ నేతలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగ ళవారం 40.13 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు రాజు తెలి పారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

క్రిస్మస్ వేడుకలకు చర్చిల అలంకరణ

- పలు చర్చిల్లో క్యాండిల్స్ లైటింగ్ కార్యక్రమాలు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి

సత్తెనపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవులకు ఆరాధ్యమైన క్రిస్మస్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొనేందుకు పట్టణంలోని క్రైస్తవులు సిద్ధమయ్యారు. పట్టణంలోని క్రిస్మస్ సందడి బాగా కన్పిస్తుది. క్యాండిల్ లైటింగ్ కార్యక్రమాలు కొన సాగిస్తున్నారు. పట్టణంలో క్రిస్మస్ వేడుకలకు సంబంధించి క్రిస్మస్ స్టార్‌లు, క్రిస్మస్ ట్రీలు, వివిధ అలంకరణ సామగ్రి అమ్మకాలు జోరు బాగా పెరిగింది. క్రిస్మస్ కేకులకు కూడా డిమాండ్ ఏర్పడింది. క్రీస్తు ప్రభువు తమ ఇంట జన్మించాడని ప్రతీకగా నక్షత్రాన్ని ఇంటిపై వేలాడ దీయటం ఒక సంప్రదాయంగా వస్తుంది. గృహాల్లో ఏర్పాటు చేసుకొనే క్రిస్మస్ ట్రీలు, శాంత క్లాజ్ టోపీలు, కోట్లు, క్రిస్మస్ ట్రీలను అలంకరించే కానుకల బాక్సుల అమ్మకాలు ముమ్మరంగా పెరిగాయి. పట్టణంలోని క్రిష్టియన్‌పేట, నాగన్నకుంట, వడ్డవల్లి, హయ్యర్ పేట, నందిగామ డొంక రోడ్డు, అంబేద్కర్ నగర్ తదితర ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకొనేందుకు క్రైస్తవులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. చర్చిలన్నీ రంగు రంగుల విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్నాయి. అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్ధనలు జరగనున్నాయి.

● ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి శాఖ కార్యాలయంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జే లక్ష్మీనారాయణ, కే పోతులూరయ్య, కైపు భాస్కర్‌రెడ్డి, రంగారెడ్డి, రామారావు, భాస్కర్‌రెడ్డి తదితరులు పా ల్గొన్నారు.

● **మాచర్లటౌన్ :** పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి ఆధ్వర్యాన క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాగిడి బాబు, పుల్లారెడ్డి, నాగరాజు, కొండలు, కొమ్ము కోటేశ్వరరావు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

● **దుర్గి :** ముటుకూరులో గల ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో సోమవారం రాత్రి సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫాదర్ ఏసుదానం భక్తులకు దైవ సందేశమందించారు. చిన్నారుల వేషదారణ, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభకాంక్షలు తెలిపారు.

● **కారంపూడి :** లూథరన్ చర్చిని క్రిస్మస్ వేడుకలకు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

రెంటచింతల: జిల్లాలోనే ఎత్తైన చర్చిల్లో ఒకటైన రెంటచింతల లూథరన్ చర్చికి ఎంతో పేరు ప్రఖ్యాతులున్నాయి. 1903లో జర్మనీకి చెందిన డాక్టర్ జార్జి



సత్తెనపల్లిలో ఏర్పాటు చేసిన భారీ స్టార్

విలియం అల్‌బ్రెక్ట్ ఈ చర్చిని నిర్మించారు. 121 సంవత్సరాల గడిచినా ఆ చర్చి నేటికి చెక్కు చెదరలేదంటే అప్పటి కూలీల పని తనానికి నిదర్శనంగా పలువురు పేర్కొంటున్నారు.

● సమాజంలోని ప్రతి ఒక్కరికి శాంతి, రక్షణ కల్పించడమే క్రిస్మస్ సారాంశమని టీడీపీ సీనియర్ నేత గొంటు సుమంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం లూథరన్ చర్చి పాస్టర్ దేవానందం ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి పండుగ ప్రాధాన్యతను వివరించారు.

● **పిడుగురాళ్ల :** బోధి పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించి చిన్నారుల నృత్య, సంగీత ప్రదర్శనలు, క్రిస్మస్ ట్రీ వంటి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఫాదర్ జాకబ్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని మతాలు సమానమని, ఒకరినొకరు గౌరవించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠ శాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

● **అచ్చంపేట :** మండలంలోని తాళ్ళచెరువులో గల బాల ఏసు దేవాలయం క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైంది. బుధవారం ఉదయం గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య దివ్య బలిపూజ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు బాల ఏసు దేవాలయం ఎదుట జూబిలీ విజయోత్సవ పతాక స్థూపం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తాళ్ళచెరువు విచారణ గురువు షట్టి అంథోని రాజు తెలిపారు.

● క్రోసూరు : మండలంలో పలు గ్రామాల్లోని చర్చిలు విద్యుత్ దీపాలతో కాంతులీనుతున్నాయి. క్రోసూరులోని ఏఈఎల్‌సీ చర్చిని సుందరంగా అలం



క్రీస్తు పుట్టుకను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన సెట్టింగ్

కరించారు. మండలంలోని పలు చర్చిల వద్ద క్రీస్తు పుట్టుకకు సాదృశ్యంగా ఏర్పాటు చేసిన సెట్టింగ్‌లు విశేషంగా అలరిస్తున్నాయి. సెయింట్ ఆన్స్ చర్చి, బేతనీయ ప్రార్థనా మందిరం, క్రోసూరు, బయ్యవరం గ్రామాల్లోని ప్రార్ధనా మందిరాలు, ఆర్‌సీఎం చర్చిలు విద్యుత్‌దీపాలతో కళకళ లాడుతున్నాయి.

● **పెదకూరపాడు:** మండలంలోని 75 తాళ్ళూరు బుడిగి జంగాల కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సెమీ క్రిస్మస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగునాడు అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు కొల్లి లక్ష్మీనరసమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మున్నీలు కేక్‌ను కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు.

● మండలంలోని పలు క్రైస్తవ దేవాలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. క్రైస్తవ దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు.

● **అమరావతి :** అమరావతిలోని పల్లోటి చర్చి, అత్తలూరులోని సెయింట్ థామస్ చర్చి, వైకుంఠపురంలోని మేరీమాత చర్చిలో సంబంధిత ఫాదర్స్ అర్ధరాత్రి ప్రార్థనలతో పాటు దివ్యబలిపూజ నిర్వహించారు. వీటితో పాటు మండలపరిధిలోని హోసన్న, తెలుగు బాపిస్టు, లూథరన్ చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి. సంఘపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

● **రాజుపాలెం :** ఎదుటివారిపై దయ.. శాంతి... ప్రేమ కలిగి ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కోటనెమలిపురి శివారు వీరమ్మ కాలనీలో ఉన్న దీనమ్మ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ, నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన నేషనల్ యాంటీ క్రైమ్ అండ్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా చైర్మన్, ఫౌండర్ డాక్టర్ సామెల్ జాన్‌కిమ్ కేక్‌ను కట్‌చేసి పలువురికి పంచిపెట్టారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గరికపాటి శంకరావు, అడ్వకేట్ మోహన్‌రాజ్, విజయకుమార్, జనసేన మండలాధ్య క్షుడు తోట నరసయ్య, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నరసింహారావు తదితరులు ఉన్నారు.




వీరమ్మకాలనీలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్‌కట్ చేసి పంచిపెడుతున్న ఆశ్రమ నిర్వహకుడు గరికపాటి శంకరరావు తదితరులు

అల్పపీడనం ప్రభావంతో చిరుజల్లులు

- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- పట్టాలు కప్పి ధాన్యాన్ని కాపాడుకునేందుకు హడావిడి

పిడుగురాళ్ల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అల్ప పీడనం ప్రభావంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. దీంతో పల్నాడు ప్రాంతమంతా చిరుజల్లులు కురుస్తున్నాయి. పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచవరం, గురజాల మండలాల పరిధిలో మధ్యాహ్నం నుంచి ఎడతెరపి లేకుండా చిరుజల్లులు పడుతుండటంతో వరికోతల్లో వెనుకబడి వున్న కొంతమంది రైతులు ఆందోళన చెందుతున్నారు.

● **దాచేపల్లి :** దాచేపల్లిలో ఎడతెరపి లేకుండా చిరుజల్లులు పడుతుండటంతో రైతులు నడికూడి మార్కెట్ యార్డులో ఆరబోసిన ధాన్యాన్ని పట్టలు కప్పి కాపాడుకుంటున్నారు. ముఖ్యంగా పిడుగురాళ్ల మండలం వీరాపురం, శాంతినగర్ గ్రామాలకు చెందిన రైతులు అధికసంఖ్యలో నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం ఆరబోశారు. ధాన్యం అమ్మేందుకు తేమశాతం ఎక్కువగా ఉండటంతో ధాన్యాన్ని కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదు 100 కేజీల బస్తా 2200 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. అదికాస్త ధర తక్కువకు అడగటంతో రైతులకు మరింత ఆర్థిక నష్టాన్ని తెచ్చి పెడుతుంది.



బెల్లంకొండలో తుఫాన్ ప్రభావంతో ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతు

మిరప పంటకు చీడపీడల దెబ్బ

పూత, పిందె దశలో ఉన్న మిరప పంటకు నాలుగు రోజులుగా మంచుతో కూడిన చిరు జల్లులు కురుస్తుండటంతో వైరస్ తెగులు వ్యాపించింది. వేల రూపాయల విలువైన మందులు పిచికారి చేసినా పంటలకు వ్యాపించిన తెగులు అదుపులోకి రావడం లేదని రైతులు వాపోతున్నారు.

● **సత్తెనపల్లి :** ప్రస్తుతం నెలకొన్న వాతావరణం రైతులను కలవరపెడుతుంది. దీనికితోడు రానున్న రెండు మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందన్న వాతావరణశాఖ సంకేతాలు వారిని మరింత ఆదోళనకు గురి చేస్తున్నాయి.

● **రాజుపాలెం :** వాతావరణంలో మార్పుతో మండలంలోని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రైతులు ఒక వైపు వరి, మరో వైపు మిర్చి కోతలు ప్రారంభించటం, దీంతో పాటు కంది పూతమీద ఉండటంతో రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి దిగుబడి తగుతుందని చెబుతున్నారు. వరికోత మిషన్‌తో కోయించిన వారు పట్టలు అందుబాటులో లేక ఇబ్బంది పడ్డారు.

● **బెల్లంకొండ :** అల్పపీడనం ప్రభావం వల్ల రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి కల్లాల్లో ఉన్న ధాన్యపు రాసులను వర్షంకు తడవకుండా కాపాడుకొనేందుకు రైతులు చాలా అగచాట్లు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పట్టాలు ఉన్న వారు ధాన్యంపై పట్టలు కప్పుకుంటున్నారు. మరి కొంత మంది రైతులు సకాలంలో పట్టాలు దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓదెలపై నీరు నిలబడి ధాన్యం కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.



ఉప్పలపాడులో ఆరబెట్టిన ధాన్యంపై పట్టా కప్పుతున్న రైతులు

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజల సహకారం కావాలి

రాజుపాలెం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని బలిజేపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కరం కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుందన్నారు. సదస్సులతో పాటు గ్రామాల్లో రీ సర్వే జరుగుతుందని ఈ సర్వే కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ దుర్గేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, కొలికొండ సీతారామయ్య శ్రీనివాసచారి, దమ్మాలపాటి యల్లయ్య తదితరులు ఉన్నారు.

కోనంకిలో 17 దరఖాస్తులు

పిడుగురాళ్ల, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కోనంకి గ్రామంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు భూసంబంధిత సమస్యల పరిష్కారం కోసం 17 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ మధుబాబు తెలిపారు. సర్వేయర్ శ్రీనివాసరావు, సీఎస్‌డీటీ సుబ్బారావు, నంద్యాల శ్రీనివాసరెడ్డి, వీఆర్‌వో కోటేశ్వర రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల రూపంలో తెలియజేయాలి : తహసీల్దార్

మాచవరం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో భూసమస్యలను అర్జీల రూపంలో తెలియజేస్తే పరిష్కారం చూపుతామని తహసీల్దార్ క్షమారాణి తెలిపారు. మంగళవారం మండలంలోని వేమవరంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు. ఈ సదస్సుల్లో ఆర్‌ఐ కోటేశ్వరరావు, మండల సర్వేయర్ సాల్మన్ రాజు, వీఆర్‌వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

గురజాలలో ఆరు అర్జీలు

గురజాలటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సచివాలయం 2 వద్ద మంగళవారం తహసీల్దార్ నగేష్ ఆధ్వర్యాన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రజల నుంచి పలు రెవెన్యూ సంబంధిత సమస్యలపై ఆరు అర్జీలు అందాయి. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నగేష్ అన్నారు. ఈ సదసస్సులో డీటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈవో పూర్ణ చంద్రరావు, ఆర్‌ఐ శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కౌన్సిలర్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రాజుపాలెం మండలం బలిజేపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి

ముటుకూరులో 13 అర్జీలు

దుర్గి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముటుకూరులో మంగళవారం తహసీల్దార్ ఫణీంద్రకుమార్ ఆధ్వర్యాన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి 13 అర్జీలను స్వీకరించారు. ఈ సదస్సులో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

● **రెంటచింతల :** ప్రజా సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని డీటీ బ్రహ్మయ్య అన్నారు. మంగళవారం రెంటాల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న సదస్సులను ఉపయోగించుకోవాలన్నారు. 7అర్జీలు రాగా వాటిలో పాసు పుస్తకాలు, కొలతల్లో తేడాలు, డిజిటల్ సంతకం చేయలేదని ఆ వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో చేరెడ్డి కోటిరెడ్డి, కృష్ణారెడ్డి, వెన్నా కృష్ణారెడ్డి, ఆర్‌ఐ రామకృష్ణ, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ ఆనందంగా జరుపుకోవాలి : యరపతినేని

పిడుగురాళ్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ ప్రపంచ పండుగ అని, పల్నాడు జిల్లాలోని క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. మంగళ వారం ఒక ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ లోకరక్షకుడు ఏసుక్రీస్తు శాంతి స్థాపన కోసం పుట్టిన మహనీయుడు, గొప్ప శాంతిదూత అని యరపతినేని తెలిపారు. క్రీస్తుమార్గంలో ప్రతిఒక్కరు నడవాలని యరపతినేని ఆకాంక్షించారు.

● సత్తెనపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని క్రైస్తవులకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు వైవీ ఆంజనేయులు, యర్రం వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయ భాస్కర్‌రెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

● జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకటప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరాం, కార్యదర్శి కనుమూరి బాజీచౌదరిలు మంగళవారం వేర్వేరు ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుభాకాంక్షలు

పెదకూరపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నియో జకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ క్రిస్మస్ శుభా కాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు ఆశీర్వాదం నియోజక వర్గంలోని ప్రతిఒక్కరిపై ఉండాలని, ప్రజలు సుఖ సంతో షాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు.

29న దొడ్లేరులో మెగా జాబ్ మేళా

రెండు వేల ఉద్యోగాల భర్తీ
ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్

క్రోసూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మండలం దొడ్లేరులోని రావిపాటి కళ్యాణ మండపంలో ఈనెల 29న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మంగళవారం వెల్లడించారు. సుమారు రెండు వేల ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. మొత్తం 35 కంపెనీలకు చెందిన ప్రతినిధులు జాబ్ మేళాకు హాజరవుతారన్నారు. ఎన్నికల హామీలో భాగంగా యువ నాయుడు నారా లోకేశ్ స్ఫూర్తితో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సంవత్సరానికి రెండు వేల ఉద్యోగుల చొప్పున ఐదు సంవత్సరాల్లో పది వేల ఉద్యోగావకాశాలు కల్పించటానికి కృత నిశ్చయంతో ఉన్నామన్నారు. 29వ తేదీన ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందని, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ ఫార్మసీ, పీజీ చదివిన అభ్యర్థులందరూ తమ అర్హతలతో హాజరుకావాలని, క్యూఆర్ కోడ్ ద్వారా కూడా తమ పేర్లను స్కాన్ చేసి రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 9441808442, 8978228794, 9493730279 నెంబర్లలో సంప్రదించవచ్చునని తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి : డీఎస్పీ

నకరికల్లు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు ఆదేశాలు జారీ చేశారు. నేరాల నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సోమవారం రాత్రి నకరికల్లు పోలీసుస్టేషన్‌ను తనిఖీ నిర్వహించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించారు.

దుకాణాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

● పట్టణ సీఐ ప్రభాకరరావు

మాచర్లటౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుకాణాల యజమానులు తమ షాపుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పట్టణ సీఐ ప్రభాకరరావు అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సీసీ కెమెరాల ప్రత్యేక డ్రైవ్‌లో ఆయన పాల్గొని దుకాణాదారులకు పలు సూచనలు చేశారు. దుకాణం ఎదురుగా ఉన్న రహదారి పూర్తి విజువల్స్ కనిపించేలా కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చేసి నేర నియంత్రణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ప్రధాన కూడళ్లలో కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు దుకాణాల యజమానులు తమకు కేటాయించిన పార్కింగ్ స్థలంలోనే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. ఈ డ్రైవ్‌లో ఎస్‌ఐ సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.


ధనుర్మాసంతో నగర సంకీర్తన

దాచేపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వందల సంవత్సరాల చరిత్ర కలిగిన దాచేపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామివారికి ధనుర్మాసంతో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. పదిరోజులుగా ధనుర్మాసంతో శ్రీవెంకటేశ్వ ర మహిళామండలి, అంకమ్మతల్లి భక్తసమాజం ఆధ్వర్యంలో నగర సంకీర్తన, తిరుప్పావై పాశురాలు పఠనం గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు రవికుమారచార్యులు, పల్లప్రోలు అనురాధ ఆధ్వర్యంలో జరుగుతున్న ధనుర్మాస ప్రత్యేక పూజ లకు దాచేపల్లి నగర పంచాయతీలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు.

క్రిస్మస్ కాంతులు

పండుగకు సర్వం సిద్ధం






తెనాలి ఐతానగర్ క్రీస్తు కృపాలయం

క్రిస్మస్ పండుగను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. పల్లె పట్టణం అన్న తేడా లేకుండా అంతటా క్రిస్మస్ సందడి మంగళవారం రాత్రి నుంచే సంతరించుకుంది. ప్రధాన చర్చిలతో పాటు కాలనీల్లో, పల్లెల్లోని చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. విద్యుత్ వెలుగుల్లో చర్చిలు కాంతులీనుతున్నాయి. ఆయా చర్చిల్లో క్యాండిల్ లైటింగ్ కార్యక్రమాలు మంగళవారం అర్ధరాత్రి అత్యద్భుతంగా జరిగాయి. చిన్న పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అలరించాయి. క్రీస్తు పుట్టక నాటకం సభికులను అకట్టుకున్నది. క్రిస్మస్ స్టార్లు, ట్రీలు, వివిధ అలంకరణలతో చర్చి ప్రాంగణాలు మిరుమిట్లుగొల్పుతున్నాయి. క్రీస్తు ప్రభువు తమ ఇంట జన్మించాడని ప్రతీకగా నక్షత్రాన్ని ప్రతీ ఇంటిపైన, ప్రధాన కూడళ్లలో వేలాడదీశారు. క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్ టోపీలు, కోట్లు, క్రిస్మస్ ట్రీలకు అలంకరించే కానుకల బాక్సుల అమ్మకాలు ముమ్మరంగా జరిగాయి. ఇక అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవులంతా ఆనందంగా పండుగను జరుపు కోవాలని, అందరి గృహాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. బుధవారం జరిగే ప్రార్థనలకు పలు చర్చిల్లో ఏర్పాట్లు జరిగాయి.



సత్తెనపల్లి పట్టణంలో చర్చి వద్ద అలంకరించిన క్రిస్మస్ స్టారులు



కాంతులీనుతున్న పాతపాన్నూరు క్రీస్తు శతవార్షిక లూథరన్ చర్చి



విద్యుత్ దీపాలంకరణలతో వెలుగులీనుతున్న తాడికొండలోని తెలుగు బాపిస్టు చర్చి




నరసరావుపేట రోడ్డు రహదారిపై విద్యుత్ కాంతులతో అలంకరించిన చర్చి



విద్యుత్ కాంతుల వెలుగుల్లో మెరిసిపోతున్న పెదనందిపాడు లూథరన్ చర్చి



నరసరావుపేటలోని విద్యుత్ దీపాలు అలంకరించిన హర్ట్ స్కూల్‌లోని చర్చి



విద్యుత్ కాంతులతో రెంటచింతల పట్టణంలో 1903లో నిర్మించిన లూథరన్ చర్చి

రేషన్ డీలర్ల ఖాళీల భర్తీపై

దోబూచులాట

- గుంటూరు ఆర్‌డీవో పరిధిలో 66 షాపుల భర్తీకి నోటిఫికేషన్
- అందులో కనిపించని గుంటూరు వెస్టులోని ఖాళీలు

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల ఖాళీల భర్తీపై రెవెన్యూ అధికారులు, దుకాణాదారులు దోబూచులాడుకుంటున్నారు. ఒక స్పష్టమైన విధానం అంటూ లేకుండా నోటిఫికేషన్లు జారీ చేయడం, ఆ తర్వాత నిలిపేయడం, మళ్లీ ఖాళీల భర్తీ అంటూ ప్రకటన ఇవ్వడం, వాటిల్లో కొన్ని షాపులను తొలగించడం చేస్తూ అయోమయానికి గురి చేస్తున్నారు. దుకాణాల విభజన హేతుబద్ధం కాదంటూ కోర్టుల్లో కేసులు వేసిన వారివి కూడా ఖాళీల్లోకి తీసుకురాలేదు.

గుంటూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 66 రేషన్ డీలర్ల నియామకానికి ఆర్‌డీవో శ్రీనివాసరావు నోటిఫికేషన్ విడుదల చేశారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామని, ఆసక్తి కలిగిన వారు జనవరి 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు నేరుగా/రిజిష్టర్ పోస్టు ద్వారా తమ కార్యాలయానికి అందేలా చూడాలన్నారు. 9వ తేదీ రాత పరీక్ష నిర్వహించి అదే రోజు ఒక్కో ఖాళీకి ఐదుగురిని ఎంపిక చేస్తారు. 10వ తేదీ ఉదయం 11 గంటలకు ఆర్‌డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి వారిలో ఒక్కో దుకాణానికి ఒకరిని ఎంపిక చేస్తారు. అర్జీ నమూన సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లోనూ అందుబాటులో ఉంచామన్నారు. అయితే ఈ ఖాళీలను ఎమ్మెల్యేలు ఎవరి పేర్లు అయితే సూచిస్తారో వారికే కేటాయిస్తారన్న విషయం బహిరంగ రహస్యమే.

గత కొన్నేళ్లలో కొంతమంది రేషన్‌డీలర్లు తమ పలుకుబడిని ఉపయోగించుకొని ఒక్కో దుకాణంలో 800లకు పైగా రేషన్‌కార్డులు మంజూరు చేయించుకొన్నారు. మరోవైపు కొన్ని దుకాణాల్లో 400 కార్డులు కూడా లేని పరిస్థితి. వీటన్నింటిని సరి చేయాలంటే తొలుత రేషన్ షాపుల రేషనలైజేషన్ చేయాలి. అయితే దాని జోలికి పోకుండా పౌరసరఫరాల శాఖ కమిషనరేట్ అధికారులు షాపుల విభజన చేపట్టారు. 800, అంతకంటే ఎక్కువ రేషన్ కార్డులు గుంటూరు నగర పరిధిలో ఏదైనా షాపులో ఉంటే 600లకు తగ్గించాలని ఆదేశించారు. అదే గ్రామీణ ప్రాంతాల్లో అయితే షాపు నకు 400 కార్డులకు పరిమితం చేయాల న్నారు. నగరంలో ఏ ఒక్క దుకాణంలోనైనా 799 కార్డులున్నా కదిలించొద్దన్నారు. దీనిపై పౌరసరఫరాల డీలర్లు అభ్యంతరం పెడుతూ హైకోర్టును ఆశ్రయించారు. దాంతో గత రెండు నెలల నుంచి రేషన్ షాపుల విభజన ప్రక్రియ నిలిచిపోయింది. తాజాగా న్యాయ సలహా తీసు కొన్న రెవెన్యూ అధికారులు ఎవరైతే హైకోర్టుని ఆశ్రయించారో వారివి పక్కన పెట్టి మిగతా షాపుల విభజనకు పూనుకొన్నారు.

ప్రత్తిపాడు మండలంలోని పాతమల్లాయపాలెం, వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడులో 2, చమళ్లమూడి, గుంటూరు ఈస్టు (రూరల్)లో బుడంపాడు, ఏటుకూరు, గోరంట్లలో 4, నగరాలులో రెండు, జొన్నలగడ్డ, రెడ్డిపాలెంలో రెండు, గుంటూరు పశ్చిమ (రూరల్)లో అడవి తక్కెళ్లపాడులో 4, చల్లావారి పాలెంలో రెండు, చినపలకలూరు, చౌడవరంలో నాలుగు, లాలుపురం, నల్లపాడు, పెదపలకలూరు, వెంగళాయపాలెంలో మూడు, తుళ్లూరు మండలంలోని తుళ్లూరు, రాయపూడిలో రెండు, మందడం-2, హరిశ్చంద్రాపురం, బోరుపాలెం, దొండపాడు కలిపి ఒకటి, మేడికొండూరు మండలంలోని పేరేచర్లలో ఆరు, గుంటూరు పశ్చిమ మండలంలోని స్వర్ణభారతీనగర్, గుంటూరు ఈస్టులోని ఎల్ఆర్ కాలనీ, ఎన్‌టీఆర్ నగర్, ఇందిరాకాలనీ, సీతానగర్, శ్రీనగర్, మంగళదాసునగర్, నల్లచెరువు, చాకలిగుంట, ఏటుకూరు రోడ్డు, సూరానగర్, అలీనగర్, ఆనందపేట, బాలాజీనగర్, ఏకావారివీధి, బుచ్చయ్యతోట, పాదర్తి వారి వీధి చక్కల బజారు, మంత్రివారి వీధి, క్రిష్టియన్‌పేట రెడ్లబజారు, యాదవబాజరు యాదవహైస్కూల్ లక్ష్మినగర్, ఆర్‌టీసీ కాలనీ మణిపురం, నల్లచెరువు, నందివెలుగురోడ్డు ఆర్‌టీసీ కాలనీ, రామిరెడ్డి తోట, డొంకరోడ్డు మల్లికార్జునపేటలోని రేషన్ దుకాణాలను ఖాళీగా చూపించి డీలర్ల ఎంపికకు నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి నగర పరిధిలో ఒక్క రేషన్ దుకాణం కూడా చూపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. దీనిపై తాము హైకోర్టుని ఆశ్రయిస్తామని డీలర్ల సంఘం నాయకులు తెలిపారు.

గుంటూరు - నడికుడి సెక్షన్‌లో

పెరిగిన రైళ్ల క్రాసింగ్‌లు

- ప్యాసింజర్ రైళ్ల సమయ పాలనపై ప్రభావం
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

గుంటూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లలో రైళ్ల సంఖ్య పెరగడంతో గుంటూరు - నడికుడి సెక్షన్‌లో క్రాసింగ్‌ల సంఖ్య పెరిగిపోయింది. ఒకప్పుడు ఈ సెక్షన్‌లో ఒకటి, రెండు రైళ్లు మాత్రమే ప్యాసింజర్‌లకు ఎదురయ్యేవి. నేడు సూపర్‌ఫాస్టు, వందేభారత్ రైళ్ల క్రాసింగ్‌లు ఉండటంతో నిబంధనల ప్రకారం ప్యాసింజర్ రైళ్లని ఏదైనా స్టేషన్‌లో లూప్‌లైన్‌లో పెట్టక తప్పని పరిస్థితి. దీంతో ప్రయాణ సమయాన్ని రైల్వే శాఖ పెంచుకుంటూ పోంది. ప్రధానంగా గుంటూరు - మాచర్ల, మాచర్ల - గుంటూరు మధ్యన ప్రయాణించే రైళ్లపై సమయపాలన ప్రభావం పడుతున్నది. దీంతో రైలు ప్రయాణీకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం గుంటూరు - మాచర్ల మధ్యన రెండు రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిల్లో మొదటి రైలు నంబరు. 07779 గుంటూరు - మాచర్ల ప్యాసింజర్ ఉదయం 8 గంటలకు బయలుదేరి 11.40కి మాచర్లకు చేరుకొంటుంది. గతంలో ఈ రైలుకు కేవం మాచర్ల - బీమవరం ప్యాసింజర్ రైలుతో మాత్రమే క్రాసింగ్ ఉండేది. అలాంటి నేడు ఎల్‌టీటీ, విజయవాడ, ఇంటర్‌సిటీ, వందేభారత్, జన్మభూమి, భావనగర్ రైళ్లతో క్రాసింగ్ ఉన్నది. దీని వలన గమ్యస్థానానికి చేరుకోవడం ఆలస్యం అవుతుండటంతో జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి రానున్న టైంటేబుల్‌లో 30 నిమిషాల అదనపు సమయాన్ని కేటాయించారు. దీని వలన ఈ రైలు మధ్యాహ్నం 12.10కి మాచర్ల చేరుతుంది. అలానే నంబరు. 07781 విజయవాడ - మాచర్ల ప్యాసింజర్ ప్రస్తుతం సాయంత్రం 5.45కి గుంటూరులో బయలుదేరి రాత్రి 9.35కి మాచర్లకు చేరుకొంటున్నది. ఈ రైలుకి మాచర్ల - గుంటూరు, ఫలక్‌నుమా, పల్నాడు, సిల్బార్, విశాఖ, చెన్నై, ఇంటర్‌సిటీ రైళ్ల క్రాసింగ్ ఉన్న కారణంగా దీని ప్రయాణ సమయాన్ని 35 నిమిషాలకు పెంచారు. ఈ కారణంగా ఈ రైలు కొత్త సంవత్సరం ప్రారంభ తేదీ నుంచి రాత్రి 10.10కి మాచర్ల చేరుకొంటుంది.

ఇదేవిధంగా నంబరు. 07782 మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ రైలు నిత్యం వేకువజామున 5.30 గంటలకు బయలుదేరి ఉదయం 9 గంటలకు గుంటూరు చేరుతున్నది. ఈ రైలుకు ఫలక్‌నుమా, పల్నాడు, శబరి, మాచర్ల ప్యాసింజర్ రైళ్ల క్రాసింగ్ ఉన్నది. అయితే ఈ రైలు ప్రయాణ సమయాన్ని కొత్త సంవత్సరంలో పెంచకుండా ఇంకా 30 నిమిషాలు తగ్గించారు. మరోవైపు నంబరు. 07780 మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ రైలు ప్రస్తుతం సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి రాత్రి 7.45కి గుంటూరుకు చేరుకొంటుంది. ఈ రైలుకు గుంటూరు - నడికుడి సెక్షన్‌లో ఇంటర్‌సిటీ, మాచర్ల ప్యాసింజర్ రైళ్ల క్రాసింగ్ ఉన్నది. దీని వలన కొన్ని సందర్భాల్లో వందేభారత్ రైలు కూడా క్రాసింగ్ అవుతున్నది. అలానే వెనకగా వచ్చే ఫలక్‌నుమా, పల్నాడుకు కూడా ప్రిసిడెన్స్ పడుతున్నది. ఈ నేపథ్యంలో రైలు ప్రయాణ సమయాన్ని 15 నిమిషాలు పెంచి రాత్రి 8 గంటలకు వచ్చేలా టైంటేబుల్‌ని జనవరి 1వ తేదీ నుంచి సవరించారు.

ఫెడరేషన్ కప్‌లో మహిళా లిఫ్టర్లకు పతకాలు

మంగళగిరి సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగిన ఫెడరేషన్ కప్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన మహిళా లిఫ్టర్లు పతకాలు సాధించారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కర్, షేక్ సంధాని మంగళవారం తెలిపారు. షేక్ సాదియా అల్‌మాస్ జూనియర్స్ స్క్వాట్ 57 కిలోల విభాగంలో 200 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం, బెంచిప్రెస్‌లో 97.5 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం, డెడ్‌లిఫ్ట్‌లో 185 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం, మొత్తంగా 482.5 కిలోల బరువును ఎత్తి జూనియర్ నేషనల్ రికార్డు సాధించడంతోపాటు బెస్ట్ లిఫ్టర్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. బొల్లినేని చంద్రిక సీనియర్స్ 84 కిలోలు పైబడిన విభాగంలో స్క్వాట్‌లో 240 కిలోల బరువును ఎత్తి రజతం, బెంచిప్రెస్‌లో వంద కిలోలతో రజతం, డెడ్‌లిఫ్ట్‌లో 210 కిలోలతో స్వర్ణం, మొత్తంగా 550 కిలోల బరువును ఎత్తి స్వర్ణ పతకం సాధించింది. షేక్ షబీనా 84 కిలోలు పైబడిన విభాగంలో డెడ్‌లిఫ్ట్‌లో తృతీయ స్థానం, ఓవరాల్‌గా ఐదవ స్థానంలో నిలిచింది. పతకాలు సాధించిన లిఫ్టర్లను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ అభినందించారు.



పతకాలు సాధించిన షబీనా, చంద్రిక, సాదియా

ప్రజలకు సౌకర్యంగా అండర్ పాస్‌లు

- ప్రజాధనం, సమయం వృథా చేసిన వ్యక్తి జగన్
- విజన్ ఉన్న నేత చంద్రబాబునాయుడు
- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు పరిశీలన

తుళ్లూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సౌకర్యంగా ఉండేలా బైపాస్ రోడ్డు నిర్మాణంలో అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజధాని ప్రాంతం మీదుగా వెళ్తున్న విజయవాడ వెస్ట్ బైపాస్ పనులను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు.


ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధన ప్రకారం ప్రతి రెండు కిలో మీటర్లకు అండర్ పాస్ మార్గాలను వేయాల్సి ఉండగా, రాజధాని నిర్మాణంలో భాగంగా ప్రజల సౌకర్యం కోసం ప్రతి కిలోమీటర్‌కు ఒక అండర్ పాస్ ఉండేలా 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం సంపూర్ణ అనుమతులు ఇచ్చింద న్నారు. అంతేకాకుండా అంతర్గత రహదారులకు కనెక్టివిటీ బాగుండే విధంగా ప్రతి కిలోమీటర్‌కు ఒక అండర్ పాస్ ఉండాలని నిర్ణయించిందన్నారు. అయితే జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆయా అనుమతులను తుంగలో తొక్కి, పాత నిబంధనను కొనసాగించమని అధికారులను ఆదేశించారని తెలిపారు. పరిపాలనపై అవగాహన, దూరదృష్టి లేని వ్యక్తి జగన్మోహనరెడ్డి అన్నారు. బైపాస్ పనులకు సంబంధించిన ప్రజాధనం రూ. 400 కోట్లు, విలువైన సమయం వృథా అయ్యిందనటానికి నిదర్శనం ఆయన తీసుకున్న నిర్ణయాలేనన్నారు. వాస్తవానికి ఏప్రిల్‌కి బైపాస్ పనులు పూర్తి కావాల్సి ఉండగా, జగన్ ప్రభుత్వ నిర్ణయాల వలన మరో ఏడాదిన్న వరకు ఆలస్యం అవుతుందన్నారు. ఏదైన చిన్న చిన్న సమస్యలు ఉన్నా సరే అధికారులతో, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామ న్నారు. చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని, ఏ ఒక్క రైతుకి, ప్రజలకు అన్యాయం జరిగే సమస్య లేదన్నారు. ప్రజల సౌకర్యార్థం అధికారులు ఇచ్చే ప్రపోజల్స్ ప్రకారం 10 అండర్ పాస్‌లు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ జీ.ఎస్.సాయి ప్రవీణ్ చంద్, ఎస్‌హెచ్‌పీడీ పార్వతీశం, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీతా ప్రభాకర్, టీడీపీ నేతలు పట్టాభిరామయ్య, బెల్లంకొండ నరసింహారావు, జమ్ముల అనిల్, నవయుగ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్, మేనేజర్ రామకృష్ణ, అదాని సంస్థ తరఫున పీడీ శ్రీరామ్ మూర్తి, బసవేశ్వరరావు పాల్గొన్నారు.



విజయవాడ వెస్ట్ బైపాస్ పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

కర్ణాటక-ఉత్తరాఖండ్

మ్యాచ్ డ్రా



సుకృత్ (74 పరుగులు) ధ్రువ్ (54 పరుగులు)

మంగళగిరి సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయ్ మర్చంట్ అండర్-16 ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో కర్ణాటక, ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ 146.1 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 445 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్ ఓవర్‌నైట్ స్కోరు 112/3 పరుగులతో మూడో రోజు బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు 66 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఆఖరి రోజు మధ్యాహ్నం నుంచి వర్షం కురవడంతో అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. కర్ణాటక బ్యాటర్లు జే.సుకృత్ 74 (నాటౌట్), ధృవ్ కృష్ణన్ 54 పరుగులు చేయగా, ఉత్తరాఖండ్ బౌలర్ ప్రియాన్షు సింగ్ రెండు వికెట్లు పడగొట్టాడు.

ఉపాధి కూలీలకు తీపి కబురు



- ఇకపై కనీస వేతనం రూ.300
- నిరంతరం తనిఖీలు, పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కూలీలకు ఎన్డీయే ప్రభుత్వం తీపి కబురు తెలిపింది. ఇకపై ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయటంతో పాటు కూలీల కనీస వేనాన్ని రూ 263 నుంచి రూ.300కి పెంచి ఇవ్వటానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగం బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట వేయటంతో పాటు, పని వేళ్లల్లో మార్పులు చేసి కూలీలకు గిట్టుబాటు వేతనం అందించేందుకు పర్యవేక్షణ చేయనుంది. ఈ విభాగానికి డ్వామాలో కీలకంగా జిల్లా విజిలెన్స్ అధికారిని నియమించింది.

సత్తెనపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) :మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కూలీలు ప్రస్తుతం నాలుగు గంటలు పాటు పని చేస్తున్నారు. అదనంగా మరో గంట పెంచేలా చూడాలని ప్రభుత్వం సూచించింది. ఉపాధి సిబ్బంది, ఏపీడీలు, ఏపీవోలు, ఎంపీడీవోలు నిత్యం మస్టర్లు తనిఖీ చేయాలి. ఈ తరహా చర్యలతో కూలీలకు సగటున మూడు వందల రూపాయల వేతనం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మొత్తం అందాలంటే ఏయే పనులు ఎంత సమయంలో చేయాల్సి ఉంటుందనే అంశాల పై జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన వేతన పర్యవేక్షణ విభాగం పర్యవేక్షిస్తుంది.

బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట..

ఉపాధి పనుల్లో ఇప్పటికే బోగస్ మస్టర్ల బోగోతం నడుస్తుంది. కూలీలు పనికి రాక పోయినా హాజరైనట్టు కొందరు సిబ్బంది మస్టర్లు వేసి వేతనాలు స్వాహా చేస్తున్నారు. వేతన దినాలు దుర్వినియోగం కావటంతో పాటు పనులకు హాజరైన కూలీలకు పూర్తిగా వేతనం అందటం లేదు. అక్రమాలు అరికట్టడానికి జిల్లా స్థాయిలో పర్యవేక్షించే జిల్లా విజిలెన్స్ అధికారి సమన్వయంచేస్తారు.



ఉపాధి హామి పనులు చేస్తున్న కూలీలు



నిబంధనలు ఇవే...

ఉపాధి కూలీలకు కనీస వేతనం పెరగటానికి ప్రభుత్వం నిబంధనలు విధించింది. నిధానంగా పనుల గుర్తింపు పని ప్రదేశానికి అనుగుణంగా చేపట్టాలి. ముందస్తుగా అంచనాలు తయారు చేయాలి. నేల స్వభావం, కూలీలు పని చేయటానికి అనువుగా ఉండేలా గుర్తించాలి. జిల్లాను యూనిట్‌గా తీసుకొని పనులు కల్పించాలి. పని వేళ్లల్లో మార్పులు చేయాలి. సాంకేతిక సహాయకులు నిత్యం పర్యవేక్షించాలి. ఏపీడీ, ఏపీవో, ఎంపీడీవోలు మస్టర్లు తనిఖీ చేయాలి. కూలీలు చేసే పని వేళలు, కొలతలు పారదర్శకంగా లెక్కించాలి. వేతనాల రసీదులు కచ్చితంగా ఇవ్వాలి.

లక్ష్యానికి అనుగుణంగా పని వేళలు



జాబ్ కార్డు ఉన్న వారందరికీ దినసరి వేతనం రూ 300 అందేలా చూస్తాం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఉపాధి కూలీల పని వేళలు పెంచాలి. రోజుకు నాలుగు గంటలు పని చేసే కూలీలు ఐదు గంటల పాటు చేస్తే కూలీ గిట్టుబాటు అవుతుంది. వేతన పెంపు పై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించాం. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజక వర్గాల్లో 1,73,549 కూలీలు నమోదయ్యారు. 99,924 మంది ఉపాధి హామి పథకంలో పనులు చేస్తున్నారు. - నారాయణ, ఏపీడీ, సత్తెనపల్లి

పల్నాడు వార్తలు

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

క్రిస్మస్ శుభాకాంక్షలు

నరసరావుపేట డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ క్రైస్తవుల లోగిళ్లలో సుఖ శాంతులు నింపాలని పలువురు ఆకాంక్షించారు. కలెక్టర్ పీ అరుణ్‌బాబు, ఎస్పీ కే శ్రీనివాసరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి, టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, జనసేన రాష్ట్ర కార్యదర్శి, సయ్యద్ జిలానీ క్రిస్మస్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

క్రైమ్ జోన్

కాలువలో దూకిన జంట

• యువకుడు మృతి

• అపస్మారక స్థితిలో యువతి

బొల్లాపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన గోవిందు నాగరాజు, ఒట్టెం భార్గవి అనే జంట మంగళవారం ఉదయం వెల్లటూరు సమీపంలోని ఎన్ఎస్‌పీ మెయిన్ కెనాల్‌లో దూకి ఆత్మహత్యకు యత్నించారు. ఐతే ఇది గమనించిన సమీప రైతులు, స్థానికులు వారిద్దరిని ఒడ్డుకు చేర్చారు. ఐతే వీరిలో గోవిందు నాగరాజు (35) అప్పటికే మృతిచెందగా, ఒట్టెం భార్గవి అపస్మారక స్థితిలో ఉంది. దీంతో ఆమెను వినుకొండ ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ వీరిద్దరికి వేర్వేరుగా వివాహాలు అయి పిల్లలు ఉన్నారన్నారు. నాగరాజు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడన్నారు. అయితే భార్గవి నాలుగు రోజులుగా కనపడటంలేదని భర్త, కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. నాగరాజు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాగరాజుకు భార్య, ఒక పాప ఉన్నారు. భార్గవి కుటుంబాన్ని గతంలో నాగరాజు డ్రైవర్‌గా అరకు తీసుకువెళ్లినట్లు తెలిసింది. అలా వారి పరిచయం వివాహేతర సంబంధంగా ఏర్పడిందని సమాచారం. వీరిద్దరిని కుటుంబ సభ్యులు వెతుకుతుండటంతో వారివారి కుటుంబాలు తమను విడదీస్తారని ఆందోళనతో ఆత్మహత్యకు యత్నించినట్లు తెలిసింది.

విద్యుతాఘాతంతో మహిళ మృతి

బొల్లాపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరులో విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. అర్ధలపూడి విజయలక్ష్మి (48) తన గృహంలో దాబామీద ఉన్న ఐరన్ రాడ్డు తీసుకొని వస్తుండగా ప్రమాదవశాత్తు రాడ్డుకు విద్యుత్ వైర్లు తగిలి ఆమె మృతి చెందినట్లు ఎస్ఐ బాలకృష్ణ మంగళవారం. తెలిపారు. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలి

• డీసీసీ అధ్యక్షుడు అలెగ్జాండర్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశంలో ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని జిల్లా డీసీసీ అధ్యక్షుడు జీ అలెగ్జాండర్ సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో మురళికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జీ అలెగ్జాండర్ సుధాకర్ మాట్లాడుతూ అమిత్‌షా గుజరాత్ హోం మంత్రిగా ఉన్న సమయంలో షావుద్దీన్ అనే వ్యక్తి హత్యకేసులో జైల్ జీవితాన్ని అనుభవించాడన్నారు. అమిత్‌షాపై చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాడతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయపాటి రామాంజనేయులు, భాషా, కృష్ణ, ప్రసాద్, రవికిషోర్, ఖాజా, పూర్ణచంద్రరావు, ప్రేమ్‌కుమార్, సీపీఐ నాయకుడు వైదన వెంకట్, డీబీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.రమేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వరీదేవి ఆరాధన మహోత్సవం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరాంపురంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఈశ్వరీదేవి ఆరాధన మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈశ్వరీ జగదీశ్వరి అమ్మవారి జీవసమాధి వద్ద బహుళపక్ష నవమి సందర్భంగా ఆరాధన కారక్రమం నిర్వహించారు. గాయత్రి మహా యజ్ఞం అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఓలేటి రాజేంద్రప్రసాదు, పెనుగొండ హనుమంతరావు, తాటికొండ బాబు, పొత్తూరి వరప్రసాదరావు, కూనిశెట్టి మురళి, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతులకు ఇక్కట్లు

బొల్లాపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాయుగుండం ప్రభావంతో మంగళవారం వర్షం కారణంగా రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చి, పొగాకు, వరి ధాన్యాన్ని కాపాడుకొనేందుకు రైతులు పరుగులు తీశారు. కల్లాల్లో ఆరబోసిన మిర్చిపై పట్టాలు కప్పారు. పొగాకు కొష్టాలు తడవకుండా ఉండేందుకు పట్టలు కప్పారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలని రైతులు డిమాండ్ చేశారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

నాదెండ్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంక్రాంతిపాడు, జంగాలపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి హరిప్రసాదు మాట్లాడుతూ మిరపపైరును ఆవహిస్తున్న బొబ్బర తెగులు, మొక్క జొన్న పైరుపై పురుగు నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు.

తడిచిన ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

• పంట నష్టం అంచనా వేయాలని అధికారులకు ఆదేశం

• ధాన్యం కొనుగోలుచేసిన 24గంటల్లో రైతు ఖాతాల్లో నగదు జమ

• అధైర్యపడవద్దని రైతులకు జీవీ ఆంజనేయులు భరోసా



వర్షానికి తడిచిన వరి పంటను పరిశీలించేందుకు వస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, కూటమి నాయకులు

ఈపూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల అకాల వర్షాలకు తడిచిన, మొలకెత్తిన, తడిచిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, అందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు రైతులకు హామీ ఇచ్చారు. ఈపూరు మండలంలోని కొండ్రముట్ల, సత్యనారాయణపురం గ్రామాల్లో అకాల వర్షం తాకిడికి తడిచిన పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి పరిశీలించి రైతులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గంలోని దెబ్బతిన్న పంటలను పంట వివరాలను తెప్పించి వారికి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జరిగిన నష్టపరిహారంపై సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్ళి బాధితులకు న్యాయం చేస్తామని, రైతులెవరూ అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. పంట నష్టపరిహారంపై నివేదిక తయారుచేయాలని అధికారులను ఆదేశించారన్నారు. జరిగిన నష్టపరిహారంపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళామని, తడిచి మొలకెత్తిన ధాన్యాన్ని కొనేలా చర్యలు చేపట్టాలని కోరామన్నారు. రైతులకు కొండంత అండగా ఎన్డీఏ ప్రభుత్వం ఉంటుందని, ధాన్యం అమ్మిన 24 గంటల్లో ఖాతాల్లో నగదు జమచేయడం చరిత్రలో ఎప్పుడూ లేదని, కూటమి ప్రభుత్వంలో ఇప్పుడు చూస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో మూడు నెలలు, ఆరు నెలలు, సంవత్సరం బకాయి చెల్లించకుండా రైతులను ఇబ్బందులు పెట్టారని ఆయన మండిపడ్డారు. కొన్ని బకాయిలను తాము వచ్చేక చెల్లించామన్నారు. గత ప్రభుత్వంలో 75 కిలోల బస్తా రూ.1775కొంటే ఇప్పుడు రూ.1740 కొంటున్నామని తెలిపారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించామని, ప్రతి రైతు ఆర్థిక ప్రగతి సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ప్రతి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పంట బీమా పేరిట రైతులను నిండాముంచారని ఎన్డీఏ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు పంట బీమా పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టామన్నారు. వైసీపీ హయాంలో పంట కాల్వలను పాడుపెట్టడం అకాల వర్షాల వలన నష్టం పెరుగుతుందని మండిపడ్డారు. ఎన్ఎస్‌పీ కాల్వల్లో పూడిక తీతకు సీఎం చంద్రబాబునాయుడు నిధులు విడుదల చేశారని, కాల్వలకు నీటి సరఫరాను ఆపివేసిన తర్వాత ఆ పనులను త్వరితగతిన పూర్తిచేస్తామన్నారు. సాగర్ ఆయుకట్టు కింద అన్ని కాల్వలను బాగుచేస్తామని తెలిపారు. ఉపాధిహామీ నిధులతో పంట కాల్వలకు మరమ్మతులుచేసి బాగుచేస్తామన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఇది రైతు ప్రభుత్వమని సీఎం చంద్రబాబు నాయుడుకు రైతు సమస్యలపై చాలా అవగాహన ఉందని, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఎంతోశ్రద్ధ చూపుతున్నారన్నారు. రైతులను ఏ విధంగా ఆదుకోవాలి, వరికపూడిశల ప్రాజెక్టు పూర్తికి ప్రయత్నాలు వేగవంతమయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని అందరూ గమనించాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులతోపాటు వ్యవసాయాధికారులు ఏడీఏ రవికుమార్, డీసీ చైర్మన్ వేణుగోపాల్, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌ను సంతోషంగా జరుపుకోవాలి

• జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రార్థన స్థలాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం రాత్రి క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రార్థన నిర్వహిస్తున్న నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రార్థన మందిరాలు, చర్చిలు ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకోవడానికి పోలీస్‌శాఖ తగిన రక్షణ చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు కూడా పోలీసు అధికారులు సూచించే సూచనలను పాటించి ఎటువంటి అవాంఛనీయ సంఘటలకు తావులేకుండా సంతోషకరమైన వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు. వాహనం నడిపేవారు మద్యం సేవించరాదన్నారు. ప్రమాదకర రీతిలో ఇతరులను భయభ్రాంతులకు గురి చేసేలా వాహనాలు నడుపరాదన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బాల భారతి పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు

నాదెండ్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులోని బాల భారతి పాఠశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ జంపని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, దయ ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని కోరారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు.



పేదలకు అన్నదానం చేస్తున్న సంఘ సభ్యులు

ఈటీబీసీ చర్చిలో అన్నదానం

వినుకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇమ్మానుయేలు చర్చి ఆవరణలో క్రిస్మస్ పండుగ సందర్భంగా వినుకొండ పట్టణంలోని నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు చాట్ల రామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైబిల్‌లో క్రీస్తు బోధించిన నీ వల్లే నీ పొరుగువారిని ప్రేమించి బోధనను అనుసరిస్తూ ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామని సంఘ సభ్యులు సహకారంతో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్‌కాంతుల నడుమ తెలుగుబాప్టిస్టు చర్చి

వినుకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్టు చర్చి క్రిస్మస్ సందర్భంగా విద్యుత్ కాంతులతో చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. బ్రిటీష్ కాలం నాటి నిర్మాణంతో నిర్మించబడిన చర్చికి ఎంతో చరిత్ర ఉంది. పండుగ సందర్భంగా చర్చి, నరసరావుపేట రోడ్డు రహదారిపై నిర్మించిన విద్యుత్ కాంతులతో ఆకట్టుకుంది.

గీతాంజలిలో క్రిస్మస్ వేడుకలు

వినుకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గీతాంజలి పాఠశాల్లో క్రిస్మస్ వేడుకలను విద్యార్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా గీతాంజలి విద్యాసంస్థల వ్యవస్థాపకులు వైశేషగిరిరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులతో ఆయన మాట్లాడుతూ క్రీస్తు మార్గంలో నడిచి ప్రతి విద్యార్థినీ విద్యార్థులు తోటివారితో ప్రేమతో మెలగాలని, క్షమ, దయ వంటివి అలవర్చుకొని భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగాలన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

తహసీల్దార్ విజయశ్రీ

యడ్లపాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయశ్రీ అన్నారు. మండలంలోని కొండవీడు రెవెన్యూ పరిధిలోని చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామ సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. సదస్సుకు హాజరైన తహసీల్దార్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కొండవీడు-1 రెవెన్యూ పరిధిలో జాయింట్ ఎల్‌పీ నంబర్ల సవరణ, మ్యుటేషన్, విస్తీర్ణంలో తేడాలు తదితరాలకు సంబంధించి 5 అర్జీలు, కొండవీడు-2 రెవెన్యూ పరిధిలో 22ఏలో చేర్చిన సర్వీసు ఈనాం భూముల సమస్యను పరిష్కరించాలని రెండు అర్జీలు రాగా, మ్యుటేషన్, కొలతలకు సంబంధించి ఒక్కొక్క అర్జీ వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. భూ సమస్యలపై వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని తహసీల్దార్ అన్నారు. అంతేగాకుండా సదస్సులు పూర్తయిన గ్రామాలకు సంబంధించి వచ్చిన అర్జీలను కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖాధికారి వీరాంజనేయులు, వీఆర్వో బాబూరావు, విలేజ్ సర్వేయర్, శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



చెంఘీజ్‌ఖాన్‌పేట రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ విజయశ్రీ, జిల్లా దేవదాయశాఖ అధికారి వీరాంజనేయులు

• నాదెండ్ల: రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఏవీ రమణ కోరారు. మండలంలోని ఎండుగుంపాలెం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ రైతులకు ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాంబాబు, వీఆర్‌వో సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

భూములు ఆక్రమణకు గురయ్యాయని కొందరు ఆన్‌లైన్‌లో భూములను ఆన్‌లైన్ నమోదుచేయాలని మరి కొందరు వినతి

• వినుకొండ టౌన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సదస్సులో వినుకొండ మండలం నుంచి పలు రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రాలు అందజేశారు. అలాగే సీపీఎం నాయకులు హనుమంతరెడ్డి, ఏపూరి గోపాలరావు, బొంకూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పట్టణంలోని వికలాంగుల కాలనీ, సుందరయ్యకాలనీలో గత 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇళ్ళ పట్టాలు మంజూరుచేసి మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరి, వీఆర్వోలు వెంకటరావు, నాగరాజు, అంజి తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

• తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

• ఏపీ రైతు సంఘం నాయకుల డిమాండ్

వినుకొండ టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో పంట దెబ్బతిన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం తక్షణమే రైతులకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబరు, నవంబరు, డిసెంబరు మాసాల్లో అల్పపీడనాలతో కురిసిన అకాల వర్షాలకు రైతులు పంటలు నష్టపోయారని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి పంట పూర్తిగా తడిచి నీటిపాలైందని, కోత దశలో ఉన్న వరి వోదెల మీద వేసిన వరి పంట పూర్తిగా తడిచిపోయిందని అన్నారు. అలాగే మిరప పంట పూత దశలో ఉండి అకాల వర్షానికి పూతరాలి తీవ్రంగా దెబ్బతిందని, మొక్కజొన్న పంట కూడా దెబ్బతిని రైతులు నష్టాన్ని చవిచూశారన్నారు. క్షేత్రస్థాయిలో పంట నష్టపోయిన రైతులను గుర్తించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే నిర్ణయించిన గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వరికపూడిశల ప్రాజెక్టు నిర్మించకపోతే రాజకీయ సన్యాసం చేస్తామని ఎన్నికల ముందు మాట్లాడిన నేతలు ఆచరణలో పాటించలేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు లభించినా అటవీ శాఖకు రూ.14కోట్లు చెల్లించలేని దౌర్భాగ్యపు పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందంటే పల్నాడు రైతుల పట్ల పాలకులు ఎటువంటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని అనుమతులు తెచ్చానని ఆర్భాటపు ప్రచారం చేసుకునే నాయకుడు కేవలం రూ.14కోట్లు అటవీ శాఖకు ప్రభుత్వం నుంచి చెల్లించి అటవీ అనుమతులు పొందలేకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయింపు చేయించకపోవడాన్ని చూస్తుంటే ఇది నాయకుల అసమర్థతకు, ఆర్భాటపు ప్రచారానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాజా, కంతేటి శివరామకృష్ణ, ముని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ

నరసరావుపేట లీగల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేసినట్లు పల్నాడు జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కంజల జగన్మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట శాసనసభ్యుడు మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ చేస్తున్న సేవలు కొనియాడారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



గతంలో అధ్వానంగా ఉన్న రోడ్డు, ప్రస్తుతం వేసిన రోడ్డు

పేరూరుపాడు వాసుల రహదారి అవస్థలకు మోక్షం

బొల్లాపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరుపాడుకు రోడ్డు లేక పది సంవత్సరాల నుంచి ప్రజలు అవస్థలు పడుతున్నారు. రహదారి అవస్థలకు కూటమి ప్రభుత్వం మోక్షం కల్పించింది. పది సంవత్సరాలుగా రోడ్డుపై బురద, గుంతలతో ప్రయాణానికి అనువుగా ఉండక ఈ రహదారిపై అనేక ప్రమాదాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో పాడైన రోడ్లపై దృష్టి సారించటంతో వెల్లటూరు నుంచి పేరూరుపాడుకు ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాలతో తారురోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. దీంతో గ్రామంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

సృజనాత్మకతకు అద్దం పట్టేలా బాలోత్సవాలు

• ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సృజనాత్మకతకు అద్దం పట్టేలా వినూత్న అంశాలలో పోటీలు బాలోత్సవం కమిటీ నిర్వహిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ విద్యార్థులలో సామాజిక స్పృహ, దేశభక్తి, అభ్యుదయ భావాలు పెంపొందిస్తున్నారని అన్నారు. అంతరించిపోతున్న దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు బాలోత్సవం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 28, 29 తేదీలలో జరగనున్న బాలోత్సవం పిల్లల పండుగ-2 జయప్రదం చేసేందుకు కమిటీ సభ్యులు, పాఠశాలల ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. శని, ఆదివారాలలో పట్టణంలోని పాలడుగు నాగయ్య చౌదరి-కొత్త రఘురామయ్య కళాశాల ప్రాంగణంలో జరగనున్న పిల్లల పండగను విజయవంత చేస్తామన్నారు. కార్యక్రమంలో పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, కమిటీ సభ్యుడు కామినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.



శివాపురంలో జరిగిన డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న సిద్ధి లింగమూర్తి

ఉపాధిహామీ పనులు పరిశీలన

వినుకొండ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాపురం గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా సాగుతున్న నిర్మాణ పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధి లింగమూర్తి మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. పనుల్లో నాణ్యత పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం పనులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ ముత్తినేని శ్రీనివాసరావు, ఏపీవో నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

• ఎంపీడీవో సీతారామయ్య

బొల్లాపల్లి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఏఎన్ఎంలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పీ సీతారామయ్య మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అందరూ ఒకరి నొకరు సహకరించుకుంటూ బొల్లాపల్లి మండలాన్ని అన్ని అంశాల్లో పురోగతి సాధించి మండలాన్ని ముందంజలో ఉంచాలన్నారు. ఉపాధి హామీలో జరుగుతున్న పనుల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బర్నబాస్ తదితరులు

నేషనల్ స్కేటింగ్ పోటీలకు కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

నరసరావుపేట టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కే-రిడ్జి ఇంటర్‌నేషన్ స్కూల్ విద్యార్థులు నేషనల్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ బర్నబాస్ మంగళవారం తెలిపారు. మోక్షరామ్‌చరణ్, మోక్షిత్, కార్తికేయ, వహీద్‌లు ఎంపికైన వారిలో ఉన్నారు. గుంటూరులో ఏరోస్కేటోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. ఎంపికైన విద్యార్థులు 2025 జనవరి 11, 12 తేదీలలో మహారాష్ట్ర షిర్డీలోని అహల్యాబీ నగర్‌లో జరిగే జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలల పాల్గొంటారన్నారు. విద్యార్థులను క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, అకడమిక్ కో ఆర్డినేటర్ పుట్ట హేమంత్, స్కేటింగ్ కోచ్ ఫిరోజ్, పీఈటీ కిషోర్ తదితరులు అభినందించారు.

ఆల్ ఇండియా అంతర విశ్వవిద్యాలయాల స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ విద్యార్థి ఎంపిక

నరసరావుపేట టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్శిటీ స్విమ్మింగ్ చాంపియన్ షిప్-2024 పోటీలకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ఎస్.జగదీష్ ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ మంగళవారం తెలిపారు. ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో జరిగిన సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్శిటీ స్విమ్మింగ్ చాంపియన్ పోటీలలో ఈ ఘనత సాధించాడన్నారు. జగదీష్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్తా, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ పూటుకూరి వెంకట అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ శ్రీనివాససాయి, పీడీ డాక్టర్ యక్కల మధుసూదనరావు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



జగదీష్‌ను అభినందిస్తున్న పాలకవర్గం కపిలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా తదితరులు